ఆంధ్రప్రభ వారపత్రిక, సెప్టెంబరు 26, 1998

"నీకు నిద్రపోవడానికి పక్కలో ఎవరో ఒకరుండాలన్నమాట. ఇలాంటమ్మాయి మగాళ్ళకు వరం! అన్నాడా అమాయకుడు భార్యతో-"

# నీవు రావు నిదుర రాదు

భాస్కరరావు తనకు ప్రేమంటే తెలుసుననే అనుకున్నాడు. చాలామంది అమ్మాయిల్ని ప్రేమించాననీ అనుకున్నాడు. కానీ అసలు ప్రేమంటే ఏమిటో తనెవరిని ప్రేమించాడో అతడికి శోభనం రాత్రి మాత్రమే తెలిసింది.

అతడి భార్య పద్మావతివి అందమైన కళ్ళు. అతడికా కళ్ళను చూసినా, ఆ కళ్ళు తనను చూసినా ఒళ్ళు జలదరిస్తుంది. పెళ్ళిచూపుల్లో ఆ కళ్ళను చూసే అతడామెను వరించాడు. ఆమె చూపులే తనకు కట్నమనుకున్నాడు.

శోభనం రాత్రి ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఏకాంతం, యౌవనోద్రేకం తొందరగానే వారి తనువులను ఏకం చేశాయి. మనసులు పరవశిస్తూంటే అది వాంఛ తీరడం వల్ల కాదనీ, ప్రేమానుభూతి తొలిపరిచయం వల్లననీ అతడికి అర్థమయింది. అప్పుడతడు ఆమెలో అంతకు ముందు తను ప్రేమించిన అమ్మాయిలనూ, తనకు నచ్చిన సినీతారలనూ చూడాలనుకున్నాడు. ఎవరితో పోల్చాలన్నా ఆమె ముఖం తప్ప మరొకటి గుర్తు రాలేదు. అదే ప్రేమ కాబోలు అనుకున్నాడు.

రాత్రి దీపం వెలుగులో అతడామె కళ్ళనే చూస్తున్నాడు. వాటి అందాన్ని పొగుడుతున్నాడు. కానీ ఆమెకు అలసటగా వుంది. ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి. అతడిని పొదువుకుని నిద్రపోయింది. ఎంత ప్రయత్నించినా అతడామె నిద్రను ఆపలేకపోయాడు.

మూతపడిన కనులతో ఆమె ముఖసౌందర్యపు వన్నె తగ్గినట్లనిపించిందతడికి. అతడిలో రవంత నిరుత్సాహం కూడా చోటు చేసుకుంది. ఆలోచిస్తూ చాలాసేపు మెలకువగా వున్నాడు. ఎప్పుడో నిద్రపట్టింది. మెలకువ వచ్చేసరికి బారెడు పొద్దెక్కింది. పక్కలో ఆమె లేదు.

రెండోరోజు రాత్రి అతడామెతో, "నేను నిద్రపోయాకనే నువ్వు నిద్రపోవాలి.

ఎందుకంటే తెరచివున్న నీ కనులు వికసించిన కలువల్లాగా నా మనసును పరవశింప చేస్తాయి. అవి మూసివుంటే నేను కలవరపడతాను" అన్నాడు.

"నేను పద్మ. మీరు భాస్కర్. మీరు నన్ను కలువభామను చేయకండి" అంటూ చమత్కరించింది పద్మావతి.

పసిపాపలను మరపించే అమాయకత్వాన్ని నింపుకున్న ఆ కళ్ళు ఓ డిగ్రీ ఫస్టుక్లాసు అమ్మాయివని అప్పటిదాకా అతడికి స్ఫురించనేలేదు.

"రాత్రంతా మెలకువగా వుండు. పగలు పడుకోవచ్చు. కొత్త పెళ్ళికూతురివి. నిన్నెవ్వరూ డిస్టర్బ్ చేయరు" అన్నాడు భాస్కరరావు.

"పగలెలా నిద్ర పోయేది? మీరు పక్కన లేకపోతే నాకు నిద్రపట్టదే!" అంది పద్మావతి.

"ఓహ్! అయితే ఇన్నాళ్ళూ ఎలా నిద్రపోయావుట?"

"నాలుగేళ్ళొచ్చేదాకా అమ్మా, నాన్నల పక్కలో, పదేళ్ళొచ్చేదాకా అన్నయ్య పక్కలో. అప్పట్నించీ బామ్మ పక్కలో –"

"అంటే నీకు నిద్రపోవడానికి పక్కలో ఎవరో ఒకరుండాలన్న మాట – ఇలాంటమ్మాయి మగాళ్ళకు వరం!" అన్నాడు భాస్కరరావు నవ్వుతూ –

"నన్ను దగ్గరగా తీసుకున్నవారి మనసులో నాపట్ల చెప్పలేనంత ప్రేమాభిమానా లున్నాయని నాకు పూర్తిగా నమ్మకం కుదరాలి. అప్పుడే నాకు నిద్రపడుతుంది. ఇంతవరకూ నాకు మంచి నిద్రపట్టింది. అమ్మ, నాన్న, అన్నయ్య, బామ్మల పక్కల్లోనే–"

"ఇంకా ఎవరి పక్కల్లో పడుకున్నావేమిటి?"

"అత్తయ్య, పిన్ని, దొడ్డ, చిన్నమ్మమ్మ..." అని ఆగిపోయి, "మిగతా పేర్లు సెన్సార్ కట్!" అందామె.

భాస్కరరావు మనస్ఫూర్తిగా నవ్వుతూ "మరి నేను?" అన్నాడు.

"మీరు నాకు నిద్రనిచ్చిన అయిదో మనిషి –" అని నవ్వి, "నా కళ్ళ అందమంతా నా సుఖనిద్రలోనే వుందని బామ్మ అస్తమానూ అంటూంటుంది" అందామె.

"మీ బామ్మకు నీ కళ్ళ అందాలే తెలుసు. నాకు నీలో ఇంకా చాలా అందాలు తెలుసు" అన్నాడు భాస్కరరావు సంభాషణకు ఫుల్‌స్టాప్ పెడుతూ.

తమ ప్రేమాభిమానాలు తాత్కాలికావేశం నుంచి పుట్టినవన్న అనుమానం భాస్కరరావులో ఇంకా వుండి వుంటే, ఆర్నెల్ల కాపురంలో అదంతా తీరిపోయింది. తాము ఒకరికోసం మరొకరు జన్మించారని నమ్మకం కుదిరేక, "పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతా యన్నది ఎంత వరకూ నిజమో తెలియదు కానీ, అవి దంపతులకు స్వర్గాన్ని చూపిస్తాయని నేను నమ్ముతాను" అని అతడామెకు చెప్పాడు.

అలాంటి సమయంలో ఆఫీసు టూరు వచ్చి ఆ దంపతులను మూడు వారాల పాటు విడదీసింది. తొలిసారిగా విరహబాధను అనుభవించిన ఆ దంపతుల కది దుస్సహమేననిపించింది. వాళ్ళు ఇంచుమించు రోజుకొక ఉత్తరం రాసుకున్నారు.

మదనతాపాన్ని అక్షరాల్లో పంచుకున్నారు.

ఒక రాత్రికి భాస్కరావు తిరిగి వచ్చాడు. ఆ క్షణం ఆ దంపతులకు పండుగ!

"ఎన్నో మాటలున్నాయి" అందామె.

"ఎన్నో చేతలున్నాయి" అన్నాడతడు.

"నీ కళ్ళేమిటీ అలాగున్నాయ్?" అన్నాడతడే మళ్ళీ.

"మీరు లేరుగా - నాకు నిద్రెలా పడుతుందీ?" అందామె.

ఆ మాటలో ఎన్నో చిలిపి అర్థాలు గోచరించి పులకరించిపోయాడతడు.

ఇద్దరూ స్నానాలు చేశారు. భోంచేశారు.

తెల్లచీర, మల్లెపూలతో ఆమె రతీదేవి అయితే అతడు అసహనంగా ఎదురు చూస్తున్నాడు.

ఆమె అతడి పక్కలో చేరింది. దగ్గరగా జరిగింది. అతడామెను పొదివి పట్టుకున్నాడు. అంతే! ఆమె కనులు మూతపడ్డాయి. అది పరవశం కాదు. నిద్ర!

భాస్కరావులో ఆవేశం, ఉద్రేకం! అతడామెకు మెలకువ తెప్పించాలనుకున్నాడు. కానీ ఆమె గాఢనిద్ర, అది అత్యాచారమవుతుందని అతడికి స్ఫురింపజేసింది.

అతడికి తెలుసు. ఆమె శరీరం కోర్కెల పుట్ట అని! అయినా ఇలాంటి సమయంలో ఆమె ఇలా నిద్రపోయిందంటే ఇన్నాళ్ళూ ఆమెకు సరైన నిద్ర లేదనే అనుకోవాలి.

"మీరు నాకు నిద్రనిచ్చిన అయిదో మనిషి" అందామె గతంలో.

అమ్మ, నాన్న, అన్న, బామ్మల తర్వాత ప్రేమానుభూతిని ఆ స్థాయిలో ఆమె భర్తనుంచి రుచి చూసింది.

భాస్కరావు ఆమె బుగ్గలను వాత్సల్యంతో నిమిరాడు. అతడి స్పర్శలో అమ్మ, నాన్న, అన్న, బామ్మ వున్నారేమో - ఆమె అతడికి మరింత దగ్గరగా జరిగింది.

భార్యాభర్తల అనుబంధం వాంఛకు అతీతమైందని గుర్తించగానే అతడికి ప్రేమంటే తెలిసింది. ఆ రాత్రికి అతడూ తృప్తిగా నిద్రపోయాడు.

మర్నాడు అతడికంటే ముందుగా లేచిన పద్మావతి, అతడు లేచాక, "సారీ! నిన్న రాత్రి నిద్రనాపుకోలేకపోయాను"అంది.

"రాత్రి నిద్ర నీకు సహజమే. నీవు పద్మ, నేను భాస్కర్" అన్నాడతడు ఆప్యాయంగా - విప్పారిన ఆమె అందమైన కళ్ళను చూస్తూ.

ఆ కళ్ళు వివాహిత స్త్రీ భర్తృప్రేమకు కొలబద్దల్లా వున్నాయి.

✦ ✦ ✦